క్లుప్తంగా

నేడు గంటవానిపాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

మునగపాక: మండలంలోని గంటవానిపాలెంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లే ఆవిష్కరణతో పాటు ప్రజలకు పథకాలపై మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయ ప్రాంగణంలో అవగాహన కల్పిస్తామన్నారు. పార్టీ జెండా ఆవిష్కరణ జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు


తంతడిలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

అచ్యుతాపురం(అనకాపల్లి): అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు.అచ్యుతాపురం మండలంలోని తంతడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముందుగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఏపీకి సీఎంగా జగన్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ,చోడపల్లి మురళి, రాజాన విజయ్, నర్మాల కుమార్, దేశంశెట్టి శంకర్‌రావు పాల్గొన్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరం


తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

మునగపాక: పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి భర్త కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ,వార్డు సభ్యులు కాండ్రేగుల జగన్‌మోహన్‌రావు,అంగన్‌వాడీ కార్యకర్తలు బి.తులసీ లక్ష్మి, కె.సత్య, ఆయాలు బి.రమణమ్మ, ఎం.రమణమ్మ పాల్గొన్నారు.

శివస్వాముల అన్నసమారాధనకు భిక్షాటన


అన్నసమారాధనకు భిక్షాటన చేపట్టిన శివస్వాములు

పాయకరావుపేట : కార్తీక మాస పర్వదినాలు సందర్భంగా మండలంలో గల శివస్వాములు అన్నసమారాధనకు భిక్షాటన చేపట్టారు. కుమారపురం, రాజగోపాలపురం గ్రామాల్లో గడప గడపకు తిరిగి భిక్షాటన చేపట్టారు. కార్తీక సోమవారం నాడు జరిగే అన్నసమారాధనకు భిక్షాటన చేస్తున్నట్టు స్వాములు తెలిపారు. శివపీఠం గురుస్వామి, ఆలయ అర్చకులు దుగ్గిరాల శివశంకర శర్మ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో బ్లీచింగ్ పిచికారీ

మునగపాక : సీజన్‌లో రోగాలు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. తుపాను కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా చేపట్టిన బ్లీచింగ్ పిచికారీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అంటు రోగాలను నివారించవచ్చన్నారు.

ఎకరాకు రూ.30వేల నష్ట పరిహారం అందించాలి

మునగపాక : తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం నేత కర్రి అప్పారావు కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. తుపాను కారణంగా వరిపైరు దెబ్బతిందన్నారు. ఎకరాకు వరికి రూ.30వేల మేర సాయం అందించాలని, నష్టం అంచనా వివరాలను వేగవంతం చేయాలని అన్నారు.



మండలంలో మత్స్యకార గ్రామాలు : 7

- మత్స్యకార జనాభా సుమారు 15 వేలు
- లైసెన్స్ కలిగిన తెప్పలు 600
- వేటకు వెళ్లేవారు 3876 మంది
- వేటనిషేధ పరిహారం రూ.10 వేలు
- మొత్తం లబ్ధిదారులకు అందిస్తున్న ఆర్థిక సాయం రూ.11.28 కోట్లు

నవశకం
సంక్షేమ సంతకం

ఆటుపోట్ల బతుకులకు భరోసా

- గంగపుత్రుల సంక్షేమానికి పెద్దపీట
- ఏటా వేట నిషేధ సమయంలో రూ.10వేల పరిహారం పంపిణీ


వేట నిషేధ సమయంలో వలలు, తెప్పలను రిపేర్లు చేసుకుంటున్న మత్స్యకారులు

నక్కపల్లి : ఆటుపోట్లను ఎదుర్కొంటూ ఉపాధి కోసం సముద్రంలో బతుకు సయ్యాటలో ప్రాణాలకు తెగించి వేట సాగిస్తుంటారు మత్స్యకారులు. వేటాడితే గాని పూటగడవని పరిస్థితి వారిది. ఇటువంటి గంగపుత్రులకు ఏడాదిలో 2నెలల పాటు వేట విరామం ప్రకటిస్తారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టడం, మత్స్య సంపద ఉత్పత్తి అయ్యే సమయం కావడంతో ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15 వరకు వేటనిషేధం అమల్లో ఉంటుంది. ఈ సమయాన్ని ప్రభుత్వం క్రాప్ హాలీడేగా ప్రకటిస్తుంది. చేపల వేట తప్ప వేరే వృత్తి ఎరుగని గంగపుత్రులంతా ఈ రెండు నెలల పాటు పస్తులుండాల్సిన పరిస్థితి. ఇళ్ల వద్ద, సముద్రపు ఒడ్డున తెప్పలు, వలలు రిపేర్లు చేసుకుంటూ జీవనం గడపాల్సిన వస్తుంది. మిగతా సమయాల్లో సంపాదించిన దాంతోటే ఈ రెండు మాసాలు గడపాల్సి వస్తుంది. వేట నిషేధ సమయంలో ప్రభుత్వాలు మత్స్యకారులకు రూ.2వేల రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని అందజేయడం రివాజుగా వస్తోంది. గత ప్రభుత్వాలు ఈ నష్టపరిహారాన్ని కూడా సకాలంలో చెల్లించేవి కావు. ఒక తెప్పపై యజమానితో కలిపి ఆరుగురు వేట సాగిస్తారు. తెల్ల కార్డు కలిగిన, రిజిస్ట్రేషన్ కలిగిన తెప్పకు మాత్రమే నష్ట పరిహారం చెల్లించడం జరిగేది. అలాగే గ్రామంలో 100 మంది వేటసాగిస్తే వారిలో సగం మందికి కూడా పరిహారం వచ్చేదికాదు. స్థానికంగా పలుకుబడిన నాయకుల అనుచరులకు మాత్రమే ఇచ్చేవారు. ఈ ఇచ్చే పరిహారం కూడా ఆరు ఏడు నెలల తర్వాత మండల కేంద్రంలో ఉన్న ఫిషరీష్ కార్యాలయం చుట్టూ పదే పదే కాళ్లరిగేలా తిరిగితే జమ చేసేవారు. పాదయాత్రలో గంగపుత్రుల సమస్యలు స్వయంగా తెలుసుకున్న జగనన్న అధికారంలోకి వస్తే ప్రతి ఏటా వేటనిషేధ సమయంలో చెల్లించే నష్టపరిహారం రూ.10వేలకు పెంచుతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే నష్టపరిహారం రూ.10వేలకు పెంచడంతోపాటు ప్రతి ఏటా మే నెలాఖరుకు మత్స్యకారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీంతో ఏటా వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఈ మొత్తం భుక్తి నిస్తోంది.


వేట నిషేధ సమయంలో నష్టపరిహారం రూ.10వేలకు పెంచినందుకు జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మత్స్యకారులు


వేటాడి తెచ్చిన చేపలు కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు

జగనన్న ప్రభుత్వంలోనే మేలు



మేమంతా ఏడాదిలో రెండు నెలల పాటు వేటకు వెళ్లడం మానేస్తాం. సముద్రంలో చేపలు పిల్లల్ని పెడతాయని వేటకు వెళ్లొద్దని పెబుత్వం చెబుతుంది. ఈ సమయంలో మాకు గతంలో నష్ట పరిహారం కింద రూ.2 వేలు చెల్లించేవారు. టీడీపీ వచ్చేక నాలుగువేలకు పెంచేరు. కానీ అందరికి ఇచ్చేవోరు కాదు. జగనన్న ప్రభుత్వం వచ్చేక వేట నిషేధం అమల్లోకి వచ్చిన నెల రోజుల్లోనే రూ.10 వేలు నేరుగా మా ఖాతాల్లో వేస్తున్నారు. **– యజ్జల అప్పలరాజు, రాజయ్యపేట**

ఆఫీసు చుట్టూ తిరగాల్సి వచ్చేది



వేట మానేసినప్పుడు ఇచ్చే డబ్బులకోసం ఫిసరీస్ ఆఫీసు చుట్టు నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. దీంట్లో కూడా రాజకీయమే. నాయకులు తమకు నచ్చిన వారిపేర్లే ఇచ్చేవోళ్లు ఇప్పుడు అలాకాదు. వేటచేసే మానోంటోళ్లందరికి డబ్బులు మాపేరున బ్యాంకులో వేసేత్తన్నారు. జగనన్న వచ్చేక ఇలా చేత్తన్నారు. ఎవరి వద్దకు ఎల్లడం మానేసం.

– పిక్కి సత్యనారాయణ, మత్స్యకారుడు

కూలికెళ్లేవోళ్లకీ ఇస్తన్నరు...



వేట సాగనపుడు ఇచ్చే నాలుగేల కోసం నాయకులు, అధికారుల చుట్టు తిరగాల్సివచ్చేది. నచ్చినోళ్లకే పెట్టుకునేవోళ్లు జగనన్న పెబుత్వం వచ్చేక ఎవ రైతే తెప్ప మీద వేటకు వెళ్తున్నారో, ఓనర్‌తోపాటు, కూలికి ఎల్లేవోళ్లకి సయితం పదేల చొప్పున బ్యాంకులో వేసేత్తన్నారు. జగనన్న పెబుత్వం వచ్చేక ఒకేసారి ఆరు వేలు పెంచి పదేల రూపాయలు ఇస్తున్నారు.

– కారే దేవుడు, మత్స్యకారుడు

గంగపుత్రుల బెంగతీరింది...



జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత గంగపుత్రుల బెంగతీరింది. వేటనిషేధ సమయంలో నష్టపరిహారాన్ని వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. పరిహారం 4వేల నుంచి రూ.10వేలకు పెంచడం జరిగింది. అలాగే ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. డీజిల్‌పై సబ్సిడీ కూడా పెంచారు. మత్స్య సామాజికవర్గానికి జెడ్పీటీసీ పదవి కూడా కేటాయించారు. జగనన్న దయవల్లే నేను జెడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికయ్యాను. **– గోసల కాసులమ్మ, మత్స్యకార మహిళ, జెడ్పీటీసీ నక్కపల్లి**

జగనన్నతోనే రాష్ట్ర సంక్షేమం


సర్వసిద్ధిలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : పేదల పక్షపాతి సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకుంటే సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా అమలవుతాయని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సర్వసిద్ధి గ్రామంలో శుక్రవారం ఏపికి జగనే ఎందుకు కావాలంటే...అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించి, ప్రసంగించారు. దేశంలో ఏ ఒక్క సీఎం, మంత్రులు ఆలోచన చేయని విధంగా సీఎం జగన్ ఆలోచన చేసి పేదవాడికి నాణ్యతతో కూడిన విద్య, పేదరిక నిర్మూలనకు సంక్షేమ పథకాలు అందిస్తూ, దేశంలో నంబర్ 1 సీఎంగా ఎదిగారన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దారబోయిన గణేష్, శానాపతి శ్రీరాములు, కొప్పిశెట్టి సత్యం, మల్లే లోవరాజు, ఎంపీటీసీలు శానాపతి రాము, బైపా శ్రీనివాసరావు, ఎస్.రాయవరం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్‌పర్సన్ అల్లాడ నాగరాజు, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, చల్లపల్లి సత్యనారాయణ, గణేష్, బాబి, మాజీ జెడ్పీటీసీ కొణంకోట నీలేంద్రరావు, ఎంపీడీవో రామచంద్రమూర్తి, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ పాల్గొన్నారు.

ఎంత దుష్ప్రచారం చేసినా వచ్చేది జగనన్న ప్రభుత్వమే


పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే బాబూరావుతదితరులు

నక్కపల్లి: ఎన్నిపార్టీలు కలిసి జగనన్నపై దుష్ప్రచారం చేసినా 2024 ఎన్నికల్లో వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. శుక్రవారం కాగిత సచివాలయంలో వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజలు సోమరిపోతులుగా తయారవుతున్నారని విమర్శించిన టీడీపీ వాళ్లే ఇప్పుడు అవే పథకాలు కొనసాగిస్తామని, పేర్లు మార్చుకుని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. టీడీపీ, జనసేన బీజేపీ ఇలా రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కలిపి పోటీ చేసినా ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డినే ఆదరిస్తారన్నారు. ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను 98 శాతం అమలు చేసిన ఘనత దేశంలో ఒక్క వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. తుపానులను కూడా రాజకీయం చేయాలని టీడీపీ ప్రయత్నిస్తోందన్నారు. వరదల వల్ల నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి కష్టం వచ్చిన చోటికి స్వయంగా వెళ్లి బాధితులను పరామర్శిస్తున్నారన్నారు. తుపాను బాధితులు ఆధైర్యపడొద్దన్నారు. ధాన్యం పాడయితే కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అనంతరం పార్టీమండల శాఖ అధ్యక్షుడు నర్సింహమూర్తి పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతంశెట్టిరాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా గుణం అలవర్చుకోవాలి


రోటరీ గవర్నర్ రావూరి సుబ్బారావుకు జ్ఞాపికను ఇస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట : ప్రపంచ దేశాల్లో ఎక్కువగా మన ముందు ఉన్న సమస్య పర్యావరణ సమస్య అని రోటరాక్టు డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ రొటేరియన్ రావూరి సుబ్బారావు అన్నారు. శ్రీ ప్రకాష్ రోటరాక్టు క్లబ్ ఆఫ్ యంగ్ లీడర్స్, సబల సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు రోటరాక్టులో చేరడం ద్వారా సేవా గుణాన్ని అలవరచుకోవడంతో పాటుగా, పరిపాలనా నైపుణ్యం, ఆర్గనైజింగ్ నైపుణ్యం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపరచుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రపంచంలో సేవా కార్యక్రమాలు చేసే క్లబ్‌లలో రోటరీ ముందంజలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు తుని రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ సర్వీస్ డైరెక్టర్, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్‌ప్రకాష్, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.బుచ్చిరాజు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ వర్మ, కార్యదర్శి కిషోర్‌రెడ్డి, రోటరాక్టు క్లబ్ ఆఫ్ యంగ్ లీడర్స్ ప్రెసిడెంట్ షణ్ముఖ్, సబల ప్రెసిడెంట్ రీనా ప్రణవి, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవాలు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పురవీధుల్లో వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులను ఘనంగా ఊరేగించారు. మహిళల కోలాటాలు నడుమ స్వామి ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తుల రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. మార్గమధ్యంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు బ్రహ్మంగారి ఉత్సవ మూర్తులను దర్శించుకున్నారు.

పంట నష్టాన్ని అధికారులు అంచనా వేయాలి

పాయకరావుపేట : తుపాను వర్షాలకు వరి పంట నీట మునిగిన కారణంగా రైతులకు జరిగిన నష్టాన్ని తక్షణం అంచనా వేయాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దేవవరపు వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతూ రైతులకు రబీకి అపరాలు విత్తనాలు సత్వరమే సరఫరా చేయాలన్నారు. వరి పంట నష్టంపై నివేదికను ప్రభుత్వానికి సత్వరమే పంపించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, ఏవో పి.ఆదినారాయణ పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవన నిర్మాణ పనులకు భూమి పూజ


దిమిలిలో భూమి పూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, బ్యాంకు అధికారులు

రాంబిల్లి : దిమిలిలో గురువారం పీఏసీఎస్ భవన నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు సిరసపల్లి రామారావు, పీఏసీఎస్ సీఈవో మద్దాల లోవరాజు దంపతులు ఈ భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ భర్త జి.శ్రీనుబాబు, వైస్ ఎంపీపీ భర్త కొటాపు వడ్డికాసులు, సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ మురళీకృష్ణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ, ఎంపీటీసీ బాబ్జి, బ్యాంకు డైరెక్టర్ కర్రి రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పన్నదొర, గోవిందరావు పాల్గొన్నారు.

వికలాంగ ఆశ్రమానికి వనితా వాకర్స్ వితరణ


ఆహార సరకులు అందజేసిన క్లబ్ సభ్యులతో వికలాంగ ఆశ్రమం నిర్వాహకుడు పట్నాయక్

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల కేంద్రంలోని ఏకీకృత వికలాంగుల అనాథ ఆశ్రమానికి విశాఖపట్నం మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు ఆహార సరకులు, స్నాక్స్, పండ్లు శుక్రవారం అందజేశారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 65 వేల రూపాయల సరుకులను ఆశ్రమ నిర్వాహకులు పట్నాయక్ ఆధ్వర్యంలో అందజేశారు. బియ్యం, కంది పప్పు, రాగిపిండి, కూరగాయలు అందజేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): పెళ్లి వయస్సు వచ్చే దాకా వివాహం చేయవద్దని మ్యాజిక్ బస్సు స్వచ్ఛంద సంస్థ ఏఐ జ్యోతి అన్నారు. అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం రామాలయంలో స్థానికులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలని సూచించారు. శ్యామల, హైమా పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో జాగ్రత్తలు పాటించండి

కోటవురట్ల: అభ్యంతరాలు లేని ఓటరు జాబితాను రూపొందించాలని పాయకరావుపేట నియోజకవర్గ ఈఆర్‌వో కె.వి.రామలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఓటరు జాబితా తయారీపై అధికారులతో శుక్రవారం సమీక్ష చేశారు. ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ సక్రమంగా ఉండాలన్నారు. బూత్ స్థాయి అధికారులు జాబితా తయారీ, రికార్డుల నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసిన ప్రతీ ఒక్కరికీ ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తే ఎందుకు తొలగించాల్సివచ్చిందో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జానకమ్మ, డీటీ సోమశేఖర్, మండల స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దిమిలి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా రామారావు

రాంబిల్లి: దిమిలి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా గోకివాడ గ్రామానికి చెందిన సి. రామారావును నియమించారు. బుధవారం డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ నియామక పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(కన్నబాబు) సిఫారసు మేరకు ఈ కమిటీని ప్రభుత్వం నియమించింది. త్రీమెన్ కమిటీలో రామారావు చైర్‌పర్సన్ కాగా సభ్యులుగా కట్టుబోలుకు చెందిన కె.రాము, కొప్పుగొండుపాలెంకు ఆర్.వీరాస్వామిలను నియమించారు.

బాధితులందరికీ పరిహారం మంజూరుకు కృషి


నామవరం గ్రామం వద్ద వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

నక్కపల్లి: తుపాను వల్ల నష్టపోయిన బాధిత రైతులందరికీ నష్టపరిహారం మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. మండలంలో ముకుందరాజుపేట, గుల్లిపాడు, రమణయ్యపేట తదితర గ్రామాల్లో నీట మునిగిన పంటను వ్యవసాయ శాఖ అధికారులతో కలసి శుక్రవారం ఆయన మరో సారి పరిశీలించారు. ఈ సందర్భగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం పూర్తిగా తడిసిపోయినట్టు చెప్పారు. నష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. తడిసిన, తేమ ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని ,రైతులెవరూ అధైర్యపడొద్దని చెప్పారు ఎమ్మెల్యే వెంట సర్పంచ్‌లు సాదిరెడ్డి శ్రీను, కర్రి శ్రీను, ఏవో ఉమాప్రసాద్, పార్టీనాయకులు శ్రీపతిరాజు, నీలేంద్రరావు తదితరులు ఉన్నారు.

పాయకరావుపేట మండలంలో..

పాయకరావుపేట: తుపాను కారణంగా దెబ్బతిన్న వరి పంటను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని నామవరం, గుంటపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుంది

కోటవురట్ల : మిచాంగ్ తుపాను కలిగించిన బీభత్సం బాధాకరమని, పంట నష్టపోయిన ఏ ఒక్క రైతూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. చౌడువాడ గ్రామంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు శుక్రవారం పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. నేరుగా పొలాలకు వెళ్లి నీట మునిగిన వరి పనలు, వరి చేలను పరిశీలించారు. కోతకు గురైన రహదారులను చూశారు. పంట నష్టంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో పంట నష్టంపై సమీక్షించారు. అధికారులు మానవతా దృక్పథంతో రైతుల నష్టాన్ని గుర్తించాలని సూచించారు. పంట నష్టపోయిన రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు జారీ చేశారన్నారు. అధికారులు పంట నష్టాన్ని పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కుమారరాజా, సర్పంచ్ గోపాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, కిషోర్, శ్రీపతిరాజు, రామునాయుడు, వాసు, రమణ, వ్యవసాయాధికారి సరోజిని పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : తుపాను తీవ్రతతో నష్టపోయిన రైతులకు ప్రతి ఒక్కరికీ నష్ట పరిహారం వస్తుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హామీ ఇచ్చారు. పి.ధర్మవరం గ్రామంలో నీటిమునిగి, దెబ్బతిన్న వరిపంటను ఎమ్మెల్యే పరిశీలించారు. వారం రోజుల్లో అన్ని ప్రాంతాల్లో వ్యవసాయాధికారులు వచ్చి జరిగిన నష్టాన్ని అంచనా వేస్తారన్నారు. గ్రామాల్లో నీటి మునిగిన ప్రతి పంట వివరాలు వేగవంతంగా నమోదు చేసి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయాధికారి సౌజన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి శ్రీను, బాబి, శ్రీపతిరాజు, నీలేంద్రరావు, గురునాథరావు, సూర్యనారాయణ, సత్తిబాబు, ఈతకొట్టు నాగు, పినపాల గణేష్, సందీప్ ఉన్నారు.

జగనన్నకు మరోసారి పట్టం కట్టాలి

మునగపాక: ప్రజలకు మేలు జరగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షులు కాండ్రేగుల జగన్ పిలుపునిచ్చారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిమ్మరాజుపేటలో శుక్రవారం రాత్రి ఆయన వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు,గృహ సారథులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వానికి, నేటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గుర్తించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గణేష్, రామభద్రరావు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన

రాంబిల్లి: గోకివాడ, మూలకొత్తూరు, మామిడివాడ పాఠశాలల్లో శుక్రవారం భారత రాజ్యాంగంపై ఉపాధ్యాయులు కె.అప్పాజీ, కె.రాజు, శ్రీదేవి,బీసీటీ సామాజిక కార్యకర్త నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. 75వ రాజ్యాంగ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్ , వ్యాసరచన పోటీలు నిర్వహించారు.